ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 25.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

శనివారం 18 మే 2024



స్ట్రాంగ్‌రూంల వద్ద సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

స్ట్రాంగ్‌రూంల వద్ద పూర్తిస్థాయి భద్రత : కలెక్టర్

పెదపాడు, మే 17 : సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద పూర్తిస్థాయి భద్రతా చర్యలతో పాటుగా నిరంతర పర్యవేక్షణ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వై.ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భద్రతా చర్యలపై సిబ్బందికి సూచనలు చేసి విజిట్ పుస్తకంలో సంతకం చేశారు. ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను కంట్రోల్‌రూం ద్వారా పరిశీలించారు. భద్రతా వ్యవస్థ పర్యవేక్షణకు డీఎస్పీ స్థాయిలో నియమించిన అధికారులతో భద్రతా చర్యలపై సమీక్షించి సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను దృష్టిలో వుంచుకుని సంబంధిత ఐడీ కార్డులు వున్న సిబ్బందిని మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. స్ట్రాంగ్‌రూంల ఆవరణలో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణను ఆదేశించారు. కాగా జిల్లాకు సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలో ఉంచి మూడంచెల భద్రతను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండవ అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, మూడవ అంచెలో స్థానిక పోలీసులు 24 గంటలు పాటు రక్షణగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

ఏలూరు క్రైం, మే 17 : ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు అత్యంత అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలు అనంతరం ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈవీఎం బాక్సులను భద్రపరిచారు. శుక్రవారం ఎస్పీ తనిఖీ చేసి అక్కడ భద్రతా చర్యలను పరిశీలించారు. ఏఆర్ ఏఎస్పీ శేఖర్, ఏఆర్‌డీఎస్పీ శ్రీహరిరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై సమీక్ష

ఏలూరు సిటీ, మే 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అనంతరం ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ ల భద్రత మరింత పటిష్ఠం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలను ఆదేశించారు. ఏపి సచివాలయం కాన్ఫరెన్స్ హాలు నుంచి శుక్రవారం సాయంత్రం కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షిత నిల్వ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐజీలు, డీఐజీలు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు.

ఓట్ల బదిలీ.. కుస్తీ!



సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ సైతం నిలదొక్కుకునే దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేయడం వల్ల వైసీపీకి గట్టి సవాల్ విసిరాయి. పార్టీ పరంగా, కేడర్ పరంగా తమకున్న బలం, బలహీనతలను ముందుగానే బేరీజు వేసుకుని ప్రధాన భాగస్వామి పక్షమైన తెలుగుదేశం నుంచి పూర్తిస్థాయి ఓట్ల ట్రాన్స్‌ఫర్ జరిగేలా ఓర్పుగా వ్యవహరించారు. కొన్ని సామాజిక వర్గాలను కూటమి పక్షాన నిలిచేలా నేర్పుగా వ్యవహరించారు. బీజేపీ, జనసేన పోటీ చేసిన మూడు అసెంబ్లీ స్థానాల్లోనూ గెలుపు తమదేననే ధీమాతో ఆ రెండు పార్టీలు ఉన్నాయి.

\- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో కూటమి వ్యూహం ఈ ఎన్నికల్లో దాదాపు ఫలించినట్లే కనిపిస్తోంది. ఆ దిశగానే పోలింగ్ రోజున పెద్దఎత్తున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటువేసేలా చేయగలిగారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నమోదైన పోలింగ్‌శాతానికి మధ్య పెద్ద వ్యత్యాసం లేకపోయినా ఓటర్లలో కనిపించిన ఉత్సాహం క్యూలైన్‌లలో గంటల తరబడి నిరీక్షణలో ఓర్పు అన్ని పార్టీలను ఆశ్చర్యపరిచాయి. ఈ క్రమంలోనే సామాజిక వర్గాల వారీగా ఓట్ల బదిలీ ఏ రూపంలో జరిగిందనే అనుమానాలు వైసీపీ లేవనెత్తినా బీజేపీ, జనసేన తమ అభ్యర్థులు పోటీ చేసిన నియోజకవర్గాలైన కైకలూరు, పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో ఆశించినట్లుగానే మద్దతు దక్కిందని, అది బ్యాలెట్ బాక్సు తెరిచేనాటికి స్పష్టం కాగలదనే ధీమాతో ఉన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు నియోజకవర్గంలోనే భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కామినేని శ్రీనివాసరావు పోటీ పడ్డారు. ఈ స్థానం ఎట్టి పరిస్థితుల్లోనూ కమలం కైవసం కావాలనే కోణంలో నామినేషన్‌కు ముందే అన్ని చక్కదిద్దారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ అంతంత మాత్రంగా ఉన్నప్పటికి టీడీపీ, జనసేనకు గట్టిపట్టు ఉంది. కైకలూరుతో పాటు మిగతా మూడు మండల కేంద్రాల్లోనూ వైసీపీకి దీటుగా టీడీపీ, జనసేన సైతం బలంగా జనంలోకి వెళ్ళాయి. ఈ క్రమంలోనే గడిచిన పోలింగ్ రోజు కూడా తాము ఆశించిన దానికన్నా ఓటర్లు తామంతట తామే స్వచ్ఛందంగా ముందుకు సాగాలని ఏ ఒక్కరి సహాయం అభ్యర్థించకుండా కొందరు అయితే ఓటర్ల స్లిప్పులను కూడా వారే రాబట్టుకుని నేరుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్ళటం తమనే ఆశ్చర్యంలో ముంచెత్తిందని కూటమి సీనియర్లే చెబుతున్నారు. జనసేన కేడర్ నుంచి బీజేపీకి ఓటు ట్రాన్స్‌ఫర్ సంతృప్తికరంగా సాగిందనే వాదన లేకపోలేదు. అయితే సామాజికవర్గంగా సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు మద్దతుదారులు కూడా తమకు మిగతా పార్టీల్లో ఉన్న కాపు సామాజిక వర్గం నుంచి ఓట్లు తమ పార్టీ వైపు బదిలీ జరిగాయని వాదిస్తున్నారు. గత ఎన్నికల్లోనూ జరిగిన అనుభవాలు, 2014 సార్వత్రిక సమరంలో చోటుచేసుకున్న పరిణామాలను విశ్లేషిస్తే కూటమి నాయకత్వం ఏదైతే ఆశించిందో ఓటు బదిలీ సంతృప్తికరంగా సాగిందని, ఈ కారణంగానే తామే విజయం సాధిస్తామనే అత్యధికుల జనాభిప్రాయంగా ఉందని, ఇంకో వాదన వినబడుతోంది.

ఆ మూడింటిలో విజేత ఎవరు..?

- కైకలూరు, పోలవరం, ఉంగుటూరు ఫలితాల పైనే అందరి ఆసక్తి
- ఈ మూడు స్థానాల్లోనూ ఎడతెగని ఓట్ల లెక్క
- కూటమిలో మూడు పార్టీల మధ్య బదిలీ జరగలేదంటూ వైసీపీ అంతర్గత ప్రకటనలు

పోలవరంలో కుస్తీనే..

పోలవరం నియోజకవర్గంలో జనసేనకు ఇంతకు ముందు ఉన్న పాత బలంతో పాటు టీడీపీ కేడర్ నుంచి బీజేపీ పక్షాన నుంచి కూడా భారీగా ఓటు బదిలీ జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉండగా, సమాంతరంగా గిరిజనులు, గిరిజనేతరులు ఎక్కువ. దీర్ఘకాలం కాలం తెల్లం బాలరాజు పోటీచేసి గెలుపొందడంతో ఆయనకు ఊరూ వాడా తాండాల్లోనూ గట్టి పట్టు ఉంది. అయితే ఈ సారి మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా పవన్‌కల్యాణ్ మీద ఉన్న అభిమానం కొంత మేర కట్టలు తెంచుకుందని, అధికార వైసీపీ అన్ని విధాలుగా మభ్య పెట్టినా ఒక ఓటు జనసేనకు, రెండో ఓటు వైసీపీ ఎంపీ అభ్యర్థికి మద్దతు దిశగా ముందడుగు వేసినట్టు ఇంకో అంచనా. దీంతో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజుకు టీడీపీ నుంచే కాకుండా అటు వైసీపీ నుంచి కూడా పెద్దఎత్తున ఓట్ల బదిలీ జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఫ్యాను, గాజు గ్లాసు గుర్తుల మీదే ఇక్కడ అందరి ఓటర్లు దృష్టి పెట్టినట్టు ఆ దిశగానే ఫలితాలు కూడా ఉంటాయనే అంచనాల్లో కూటమి ఉంది.

ఉంగుటూరు నియోజకవర్గంలో..

ఉంగుటూరు నియోజకవర్గంలో తెలుగుదేశం నుంచి ఓట్ల బదిలీ జనసేన వైపు ఏ మేరకు జరిగిందనే ప్రశ్నకు నూటికి నూరుశాతం అనే సమాధానం వినిపిస్తోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో తెలుగుదేశంకు బలమైన కేడర్ ఉంది. బీజేపీలోనూ వేడినీళ్ళు చన్నీళ్ళు అనే ధోరణిలోనూ నాయకత్వం ఉంది. ఎటుతిరిగి జనసేన ఆదినుంచి ఇక్కడ దూకుడుగా వ్యవహరిస్తుండడం కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థే వైసీపీ పక్షాన బరిలో ఉండడం, ఓట్ల చీలిక జరిగి ఉంటుందనే ఊహలు లేకపోలేదు. అయితే జనసేన, టీడీపీ, బీజేపీలో ఉన్న ఇదే సామాజిక వర్గానికి చెందిన అనేక మంది బహిరంగంగా కూటమి అభ్యర్థికి తోడుగా నిలుస్తామని ప్రకటించటం గ్రామాలవారీగా తమంతట తాముగా తీర్మానాలు చేసి జనసేన పక్షాన నిలవడం ఈసారి జరిగిన ఎన్నికల్లో రాజకీయ మలుపుగా భావిస్తున్నారు. ఎందుకనంటే ఈ నియోజకవర్గంలో తెలుగుదేశంకు క్షేత్రస్థాయిలో గట్టిపట్టు ఉంది. దాదాపు అన్నివర్గాలకు చెందిన నేతలు టీడీపీలో క్షేత్రస్థాయిలో జరిగే ఏ కార్యక్రమానికి అయినా నాయకత్వం వహిస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్నా ఎక్కడా వెనక్కి తగ్గకుండా నష్టం, కష్టం ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. అంతలా టీడీపీ బలమైన కేడర్‌ను ప్రతి గ్రామంలోనూ సమకూర్చుకుంది. ఈ నేపథ్యంలో కూటమి మాత్రమే గెలవాలి అనే ఏకైక లక్ష్యంతో ఒకవైపు బీసీలు, ఇంకోవైపు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు ఇతర వర్గాలకు చెందిన వారు ఎక్కడా బయట హడా వుడి చేయకుండా లోలోన ఓటు బదిలీ జరిగేలా చేయగలి గారు. గతంలో జనసేనకు వచ్చిన ఓట్లు తెలుగుదేశం పార్టీకి లభించిన రికార్డు స్థాయి ఓట్లు బీజేపీ పడిన అంతంత మాత్రం ఓట్లు అన్ని కలిపి గంపగుత్తగా కూటమి అభ్యర్థి ధర్మరాజు వైపు మళ్ళినట్లు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఓట్లు బదిలీ జరగలేదని, వైసీపీ చేస్తున్న ప్రచారంతో గ్రామగ్రామాన తమకు ఉన్న కేడర్‌ను లెక్కేసి మరీ గెలుపు తమదేనని కూటమి అభ్యర్థి ధర్మరాజు, ఆయన అనుకూలురు ఒక నిర్ణయానికి వచ్చేశారు. తెలుగుదేశం మనస్ఫూర్తిగా ఈ ఎన్నికల్లోనూ, పోలింగ్‌నాడు సంపూర్ణంగా మద్దతు నిలిచిందని, అది ఓటు రూపంలో ప్రకటించిందనే వాదనతో జనసేన ఉంది. ఇక్కడ ఈ నియోజకవర్గంలో పందేలు విషయానికి వస్తే వైసీపీ పక్షాన, టీడీపీ పక్షాన కాసేందుకు కొందరు ముందుకు వస్తున్నారు. ఇంకొందరు వెనుకంజ వేస్తున్నారు. అయితే అత్యధికులు మాత్రం జనసేన అభ్యర్థి గెలుపు ఖాయమనే కోణం వైపు మొగ్గు చూపుతున్నారు. మండలాలవారీగా ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందనే విషయంలోనూ పందేలు ఇంకోరీతిలో సాగుతున్నాయి. ఈ పందేలు అన్ని కూడా ఉంగుటూరు నియోజకవర్గంలో ఓటు బదిలీ జరిగిందా? జరగలేదా? అనే కోణంపైనే కావడం ఇంకో విశేషం. దీనికి తగ్గట్లుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆయన సోదరుడు గోపాలరావు మనస్ఫూర్తిగా కూటమి పక్షాన అభ్యర్థిగా ఉన్న ధర్మరాజు గెలుపుకే నూటికి నూరుశాతం పనిచేశారని అందుకనే ఇప్పుడు ధర్మరాజు గెలుస్తాడనే దిశగా ఎన్నికల అంచనాలకు వచ్చారని తెలుగుదేశం సీనియర్లు వాదిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ సరళి, అనుకూలత ఈ రెండింటిపై కూడా అటు తెలుగుదేశం, ఇటు జనసేన నాయకత్వాలు ఆరాతీసి సీటుమనదేనని ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. వైసీపీ మాత్రం వెనక్కి తగ్గకుండా స్వల్ప మెజార్టీతోనైనా తామే గెలుపొందుతామని ప్రచారానికి మరింత విస్తరించింది.

కూరల మంట!



ఏలూరు రూరల్, మే 17 : సామాన్యులు కూరగాయల ధరలు చూసి కొనాలం టేనే బెంబేలెత్తుతున్నారు. గత వారం వరకూ నిలకడగా ఉన్న కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఒకపక్క ఎండ తీవ్రత, మరో పక్క తుపాన్‌ల ప్రభావం కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం పడడంతో కూరగాయల ధరలు సామాన్యులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నగరంలోని బహిరంగ మార్కెట్‌లో కూరగాయలను ముట్టుకుంటే మంట మండుతోంది. రైతు దగ్గర పంట లేదు. ఎండాకాలం పంట పండదు. అదే అదనుగా వ్యాపారులు ధరలు పెంచి నిలువు దోపిడీ చేస్తున్నారు. డిమాండ్‌కు సరిపడా లోకల్ కూరగాయలు నిల్వలు లేక ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. కొన్ని కూరగాయలైతే దినసరి కూలీలు చేసుకుని బతుకును ఈడ్చే కుటుంబాలు అసలు కొనే పరిస్థితి లేదు. సీజన్‌ను బట్టి రెట్టింపు కావడం సహజం. కాని ప్రస్తుత మార్కెట్లో కూరగాయల ధరలు ఒకేసారి భారీగా పెరగడం సామాన్యులను కలవర పెడుతోంది. సాధారణ రోజుల్లో కిలో రూ.20 లోపు లభించే కూరగాయలు ప్రస్తుతం కిలో రూ.50 నుంచి రూ.60 లకు చేరాయి. కిలో రూ.15 నుంచి రూ.20కి లభ్యమయే టమాటా ఇప్పుడు కిలో రూ.50కి చేరింది. గతం లో రూ.10 మూడుకట్టలు ఆకుకూరలు లభించేవి. ఇప్పుడు రూ.20లకు మూడు కట్టలు ఇస్తున్నారు. మిర్చి కేజీ రూ.140, అల్లం రూ.150, వంకాయలు కిలో రూ.40, బీరకాయలు రూ.50, చిక్కుడు కాయలు రూ.70,

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- వినియోగదారుల బెంబేలు
- డిమాండ్‌కు తగ్గ సరఫరా లేదు : వ్యాపారులు



బెండకాయలు రూ.50, క్యాబేజి రూ.50, బంగాళ దుంప రూ.50, దొండ కాయలు రూ.60, బీట్‌రూట్ రూ.60, కంద రూ.60, ఉల్లిపాయలు రూ.30, కాకరకాయ రూ.40, దోసకాయలు రూ.30, క్యారెట్ రూ.40, క్యాప్సికం రూ.120 లకు చేరడంతో సామాన్య, మధ్యతరగతి జనం ధరలు చూసి బెంబే లెత్తుతున్నారు. ప్రభు త్వం చర్యలు తీసుకుని కూరగాయల ధరలను నియంత్రించాలని వినియోగదారులు కోరుతున్నారు.

గోదావరిలో నిషేధిత వలలతో చేపల వేట

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పోలవరం, మే 17 : పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరిలో ఇతర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు నిషేదిత ఐలా (చిన్న చేపలను సైతం పట్టే సన్న రంధ్రాల వల) వలలతో చేపల వేట కొనసాగిస్తున్నారు. చిన్న చేప పిల్లలను సైతం పట్టడం వల్ల చేపల సంతతి తగ్గి తమ ఉపాధి కోల్పోతున్నామని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే విధంగా కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం ప్రాజెక్టు ఎగువన వేటాడుతున్న ఇతర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులను అటవీశాఖ, మత్స్యశాఖ అధికారులు స్థానిక మత్స్యకారుల ఫిర్యాదు మేరకు అడ్డుకుని పంపివేయడంతో ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో వేటకు పూనుకున్నారు. గోదావరి ఇసుక తిన్నెల్లో మకాం వేసి పట్టిన చేపలను తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం, వంగలపూడి మీదుగా లారీలపై ఎగుమతి చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక అధికారుల నియామకం

ఏలూరు సిటీ, మే 17 : జిల్లాలో వర్ష సూచనల కారణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్టు జేసీ లావణ్యవేణి తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రైతులకు ఏదైనా సహాయం అవసరం అయితే దగ్గరలోని రైతు భరోసా కేంద్రం సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 2,16,740 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయం లక్ష్యానికి ఇప్పటివరకు లక్షా 98వేల 120 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి అనుసంధానం చేయబడిన రైస్‌మిల్లులకు రాండమైజేషన్ ద్వారా తరలించినట్టు తెలిపారు. రైతులకు రూ. 225.67 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేశామన్నారు.







కొత్తపేటలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఏలూరు కొత్త పేటలో కార్డన్ సెర్చ్

ఏలూరు క్రైం, మే 17 : ఏలూరు కొత్తపేటలో ఇటీవల ఘర్షణలకు పాల్పడుతుండడంతో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్, ఎస్ఐలు మదీనాబాషా, రవితేజ, సాయుధబలగాలు, నగరంలోని వివిధ స్టేషన్లలోని సిబ్బంది కలిసి ఏకకాలంలో కొత్తపేట ప్రాంతాన్ని పోలీసుల వలయంతో చుట్టివేశారు. ఇతరులను లోపలికి వెళ్ళకుండా, లోపలి వారిని బయటకు రాకుండా ముట్టడించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. టూటౌన్ సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతమై కొత్తపేట ప్రాంతంలో ఇప్పటికే పికెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, ప్రజా శాంతికి భంగం కల్గించే వారి వివరాలను పోలీసులకు, డయల్ 100 లేదా 112కు గాని సమాచారం అందించాలన్నారు.

నగరంలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయండి : ఎస్పీ



ఏలూరు నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే ప్రాంతాల్లో ముందస్తుగా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత రాజకీయ పార్టీలకు చెందిన కొంత మంది వ్యక్తులు ప్రజా శాంతికి భంగం కలిగేలా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ముందస్తుగా గతంలో అల్లర్లకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి గట్టి నిఘా ఉంచాలన్నారు. ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్, ఎస్ఐలు మదీనాబాషా, సాదిక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యలకు ఆక్సిజన్ కొరత

- వాతావరణంలో మార్పులు
- ఒకవైపు ఉక్కపోత.. మరోవైపు చినుకులు
- హడావుడిగా పట్టుబడులు
- అయినకాడికి అమ్మకాలు
- గిట్టుబాటు ధర రాక రైతుల ఆవేదన

మండవల్లి, మే 17: అసలే వేసవికాలం.. ఉక్కపోత.. ఆపై పడనా వద్దా.. అంటూ చినుకులు పడుతుండడంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తీవ్రతతో చెరువుల్లో నీటిమట్టం తగ్గిపోయి ఆక్వా సాగు అయోమయం పరిస్థితికి చేరిన పరిస్థితుల్లో శుక్రవారం నెలకొన్న వాతావరణం మరింత భయ భ్రాంతులకు గురిచేసింది. ఇప్పటికే జగన్ ప్రభుత్వంలో సంక్షోభం ఎదుర్కొంటున్న ఆక్వా రైతులకు వాతావరణ మార్పు లతో మూలిగే నక్కపై తాటికాయ పడినట్లయింది. వాతావరణంలో అకస్మాత్తుగా సంభవించిన మార్పు లతో ఉక్కపోత తోడవడంతో చెరువులో ఆక్సిజన్ సమస్య తలెత్తి రైతులకు తలకి మించిన భారంగా మారింది. చెరువుల్లో ఆక్సిజన్ కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్ సీట్లు తిరుగుతున్నప్పటికి ఉక్కపోత ప్రభావంతో రొయ్యలు పైకి రావడంతో ఆక్సిజన్ మందులు వాడాల్సిన పరిస్థితి తలెత్తింది. కొందరు రైతులు మందుల ఖర్చులు భరించలేక అయిన కాడికి రొయ్యలను పట్టుబడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు వైట్ కట్ వైరస్ వంటి వ్యాధుల నుంచి రొయ్యలను కాపాడుకుని సాగు చేస్తున్నా చివరకు గిట్టుబాటు ధర రాక పోవ డంతో ఇబ్బంది పాలు అవుతున్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్కెట్ ధరలు తగ్గిపోవడంతో రైతులు కోలుకోని ఏర్పడింది. మార్చి నెల మొదటి వారంలో తగ్గిన రొయ్యల ధర నేటికీ పెరగక పోవడంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రొయ్యల ఎగుమతి దారులు సిండికేట్‌లా మారి ధరలను నియంత్రించడంతో ఆక్వా రైతులకు శాపంగా మారింది. రెండు రోజులుగా వాతావరణంలో సంభవించిన మార్పులు ఇబ్బందికరంగా మారింది. విద్యుత్‌పై బిల్లులు ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించకపోవడం మొక్కుబడిగా వ్యవహరించడంతో రైతులకు ఖర్చు భారం మరింత పెరిగింది. టీడీపీ హయాంలో ఆక్వా సాగుకు ఇచ్చిన సబ్సిడీ కూడా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయక పోవడం దురదృష్టకరమంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వచ్చే కొత్త ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరిస్తుందన్న ఆశాభావంతో ఆక్వా రైతులు ఉన్నారు.



హడావుడిగా రొయ్యల పట్టుబడి



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్స్



7

ద్వారకా తిరుమలలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నేడు వధూవరులుగా స్వామి, అమ్మవార్లు

కోలుకుంటున్న ఆదివాసీలు

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో 13 మందికి చికిత్స
- కురుములతోగులో బోరు ఏర్పాటు
- 15 పంచాయతీల్లో పారిశుధ్య చర్యలు



పారిశుధ్యం మెరుగుదల చర్యలు

కుక్కునూరు, మే 17 : డయేరియాతో విలవిలాడిన ఆదివాసీ గ్రామాలు కోలుకుంటున్నాయి. కొసాయి గుంపులో గురువారం మూడు కేసులు నమోదు కాగా శుక్రవారం మరో మూడు కేసులు నమోదయ్యాయి. వారిని కూడా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కురుములతోగుకు చెందిన ఏడుగురు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మృతి చెందిన మడకం దేవరాజు (7) తండ్రి మడకం గంగయ్య కూడా అనారోగ్యం పాలవడంతో అమరవరం ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. వైద్యబృందాలు గ్రామంలో ఇంటింటా తిరిగి రక్తపరీక్షలు నిర్వహించి ఏ మాత్రం అనుమానంగా ఉన్న ఆస్పత్రికి తరలిస్తున్నారు. కాగా ఆదివాసీ గ్రామాలతో పాటు మండలంలోని 15 పంచాయతీల్లో అధికారులు పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పీవో ఇచ్చిన హామీ మేరకు కురుములతోగు గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. 25 ఏళ్లగా మంచినీటి బోరుకోసం ఆ గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు. ఇద్దరు మృతి చెందితేగాని గ్రామంలో మంచినీటి బోరు వేయలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొసాయిగుంపులోను మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. కాగా అనారోగ్యానికి గురైన ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించి వారిని కాపాడాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. సమస్య వచ్చినప్పుడు అధికారులు హడావిడి చేయకుండా ముందస్తుగానే ఆదివాసీల గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు.



కురుములతోగులో తాగునీటి బోరు వేస్తున్న దృశ్యం



ఆదివాసి మహిళ, చిన్నారిని డోలీలో ఆసుపత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

డోలీలో ఆసుపత్రికి

ఆదివాసీ గ్రామం నుంచి బాలింత, చిన్నారి తరలింపు

కుక్కునూరు, మే 17: ఆదివాసి గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. లచ్చిపేట గ్రామంలో పోసి అనే ఆదివాసి మహిళ పోసి కొన్ని రోజుల క్రితం బిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారి బరువు తక్కువగా ఉండడంతో అనారోగ్యం బారిన పడింది. చిన్నారిని తల్లిని కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడానికి మంచంతో కలిపి డోలిని ఏర్పాటు చేశారు. దాదాపు 3కిలోమీటర్ల దూరం డోలిలో వారిని గుండంబోరు గ్రామం వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో కుక్కునూరు పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించినట్లు డాక్టర్ పూర్ణశ్రీనివాస్ తెలిపారు.

కొబ్బరి ధర పతనం

● దిగుబడి లేదు.. ధర లేదు.. ● మరోవైపు తగ్గిన ఎగుమతులు

పాలకొల్లు, మే 17 : కొబ్బరి ధర పడిపోయింది. 15 రోజుల వ్యవధిలో వెయ్యి కాయలకు రూ.2వేలు ధర తగ్గింది. జిల్లాలో మే ఆరంభంలో కొబ్బరి ధర వెయ్యి కాయలు రూ.9 వేల నుంచి 10వేలు ఉండగా ప్రస్తుతం రూ. 8వేలకు పడిపోయింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి కొబ్బరి ఎగుమతులు గణనీయంగా తగ్గాయి. మామిడి పండ్ల సీజన్ మొదలు కావడం, మరో వైపు మూఢం ఉండడంతో ఉత్తరాది రాష్ట్రాలలో కొబ్బరికి డిమాండ్ తగ్గింది. రైతు వారీ కొనుగోలు ధర రూ. 8వేలు ఉండగా ఎగుమతి ధరలు మందగించాయి. ఢిల్లీ క్వాలిటీ పచ్చి కొబ్బరి ధర రూ.9వేలు, కురిడి ధర రూ. 10వేలు ఉంది.

తగ్గిన దిగుబడి

సాధారణంగా ఏప్రిల్, మే, జూన్‌లో కొబ్బరి దిగుబడి అధికం. ఈ ఏడాది మూడింట రెండు వంతుల దిగుబడి తగ్గిపోయింది. దిగుబడి తగ్గినప్పుడు మార్కెట్‌లో కొబ్బరి డిమాండ్ మేరకు ధర మెరుగ్గా ఉంటుంది. ప్రస్తుతం దిగుబడి తగ్గి, ధర కూడా తగ్గడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రోజుకు 80 నుంచి 100 లారీల కొబ్బరి ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం 20 నుంచి 30 లారీలకు తగ్గింది.

మరో రెండు నెలలు ఇంతే..

సమీప కాలంలో పండగలు లేకపోవడం, మూఢం కారణంగా ముహూర్తాలు లేకపోవడంతో కొబ్బరి వినియోగం తగ్గింది. ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో వ్యాపారులు కొబ్బరిని అధికంగా నిల్వ చేశారు. పెద్ద వ్యాపారుల వద్ద 10 లక్షల కాయలు, చిన్న వర్తకుల వద్ద లక్ష పైబడి కురిడి కాయ నిల్వ చేసారు. తొలకరి అనంతరం జూలై, ఆగస్టులో ఎగుమతులు పెరుగుతాయని వ్యాపారుల అంచనా. మరో రెండు నెలలు వేచి ఉంటే కురిడి గండేరా వెయ్యి కాయల ధర రూ. 15వేలకు చేరవచ్చని భావిస్తున్నారు.

శ్రావణంలోనే శోభ

కొబ్బరి దిగుబడులు గత 5, 6నెలలుగా గణనీయంగా తగ్గిపోయాయి. శ్రావణం నాటికి కొబ్బరి దిగుబడులు మెరుగుపడడంతో పాటు ధరలు పెరుగుతాయని మార్కెట్ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రైతులు తొందరపడి



పచ్చి కొబ్బరి దింపకుండా ఉంటే మంచి ధరకు అమ్ముకునే అవకాశాలు ఉన్నాయని వారు సూచిస్తున్నారు.

నాణ్యమైన కాయలే దింపాలి



రైతులు మార్కెట్‌ను పరిశీలించి చెట్ల నుంచి కొబ్బరి కాయలు దింపాలి. ప్రస్తుత అన్ సీజన్‌లో కొబ్బరి దింపుతో ధర మరింత పతనమైంది. కొబ్బరి కాయలు చెట్టునే ఉంటే తయారైన తరువాత 2 నెలలైనా ఆగుతుంది. శ్రావణం వచ్చేంత వరకూ రైతులు బరువు కొబ్బరి దింపకుండా జాగ్రత్తలు తీసుకుంటే శ్రావణంలో మంచి ధర పొందే అవకాశం ఉంది.

మైగాపుల రాంబాబు, కొబ్బరి వ్యాపారి

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



చైతన్యబాబు మృతదేహం

పెదపాడు, మే 17: మండలం లోని కొణికి గ్రామంలో చేపల చెరువు వద్ద పనిచేసే వ్యక్తి శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కొణికి గ్రామంలోని శివప్రసాద్ రాజు చేపల చెరువుపై పందు చైతన్యబాబు (28) పని చేస్తున్నాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో చెరువు మీదకు వెళ్లిన పండుబాబు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. చైతన్యబాబు కొంతకాలంగా భార్యతో దూరంగా ఉంటున్నాడు. ఇటీవల అతడి భార్య మృతి చెందినట్లు తెలిసింది. విద్యుదాఘాతంతో మృతి చెందిన సమాచారం అందుకున్న పెదపాడు ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఉండి, మే 17: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ లక్ష్మణ్ శుక్రవారం కేసు వివరాలు తెలిపారు. ఈ నెల 11న భవానిపేటలో ఒక వ్యక్తి అపస్మారకస్థితిలో పడిఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 15న అతడు మృతిచెందినట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796648, 9154875653 నెంబర్లకు తెలియజేయాలని ఎస్‌ఐ లక్ష్మణ్ సూచించారు.

ఆస్తి ఇవ్వకుండా మోసగించారని అత్తింటివారిపై కేసు

ఏలూరు క్రైం, మే 17: తన భర్త వారసత్వంగా వచ్చే ఆస్తిని ఇవ్వకుండా మోసగించారంటూ అత్త, మామ, ఆడపడుచుపై కోర్టులో ఫిర్యాదు చేయగా కోర్టు ఆదేశాల మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వట్లూరుకు చెందిన వీరమాచినేని శృతి భర్త మరణించారు. ఆమెకు ఒక కుమార్తె ఉన్నారు. భర్త తరపున రావాల్సిన ఆస్తిని ఇవ్వకుండా మామ కృష్ణమోహన్, అత్త రత్నకుమారి, ఆడపడుచు నిమ్మగడ్డ అన్నపూర్ణ వేధిస్తూ ఆమెను ఇంటి నుంచి గెంటివేశారు. ఉద్దేశ్యపూర్వకంగానే ఆమె ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయకుండా తనను మోసం చేస్తున్నారంటూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో ఆ ముగ్గురిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప సామగ్రి దొంగకు ఆరు నెలల జైలు

ఏలూరు క్రైం, మే 17: బోర్‌వెల్‌కు సంబంధించిన ఇనుప సామగ్రిని అపహరించిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ ఏలూరు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ కె.స్పందన శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు రూరల్ మండలం కొత్తూరు ఇందిరమ్మ కాలనీ టిడ్కో ఇళ్ల వద్ద బోరు పనులకు సంబంధించిన సామాన్లను 2022 అక్టోబర్ 19న కొంత మంది అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అప్పటి ఎస్‌ఐ ఎన్ లక్ష్మణబాబు కేసు నమోదు చేశారు. ఈ నేరానికి పాల్పడిన కొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన పఠాన్ రోజాఖాన్ (25)ను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరు ఎక్సైజ్‌కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ జడ్జి స్పందన తీర్పు చెప్పారు.

కానిస్టేబుల్‌పై దాడి : కేసు నమోదు

నరసాపురం టౌన్, మే 17: పట్టణంలోని లూథరన్ చర్చి సమీపంలో గురువారం రాత్రి చికెన్ దుకాణం కట్టివేయాలని నైట్ బీట్ కానిస్టేబుల్ జి పాపారావు చెప్పడంతో అతడిపై దాడి చేశాడు. కానిస్టేబుల్ కంటికి గాయం కాగా ఆస్పత్రిలో చేర్పించారు. ఇదే సంఘటనలో కానిస్టేబుల్ తనను కొట్టాడంటూ చికెన్‌షాపు దానయ్య, దుర్గ ఫిర్యాదుతో పట్టణ ఎస్సై సూర్యనారాయణరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

ఆచూకీ అడిగితే దాడి..

భీమవరం క్రైం: వన్‌టౌన్‌లోని ఒక యువతి ఆచూకీ కోసం సమీపంలోని మరో ఇంట్లో అడిగితే వారు కొట్టారని పి.దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇంటి ముందు కారు అపహరించారు

ఏలూరు క్రైం, మే 17: ఇంటి ముందు ఉంచిన కారు అపహరించారని బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. రామకృష్ణాపురం మూడో రోడ్డులో ఉంటున్న పల్లపోతు హేమసాయి ఈనెల 11న రాత్రి మారుతి స్విఫ్టుకారు (ఏపీ 05 టీసీ 5856)ను ఇంటి ముందు పార్కు చేశారు. తెల్లవారేటప్పటికి కారు కనిపించలేదు. శుక్రవారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

చింతమనేని, అనుచరుల అరెస్టుకు రెండు బృందాలు

ఏలూరు క్రైం, మే 17: పెదవేగి పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడిని మాజీ ఎమ్మెల్యే చింతమనేని, అనుచరులు తీసుకుపోవడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. వారిని అరెస్ట్ చేయడానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం తెలిపారు. కొప్పులవారిగూడెం గ్రామానికి చెందిన తాళ్ళూరి రాజశేఖర్‌ను చింతమనేని ప్రభాకర్ తన అనుచరులతో వచ్చి పోలీస్ స్టేషన్ నుంచి తీసుకుపోయారంటూ పెదవేగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్పీ వివరించారు.

రైతులకు న్యాయం చేయాలి

● ఓఎన్‌జీసీ పైపులైన్ పనుల అడ్డగింత ● వైఎస్‌పాలెం, రుస్తుంబాద రైతుల ఆందోళన



భారీగా మోహరించిన పోలీసులు



ఓఎన్‌జీసీ అధికారులతో చర్చిస్తున్న బొమ్మిడి నాయకర్

నరసాపురం రూరల్, మే 17: ఓఎన్‌జీసీ పైప్‌లైన్ పనులతో నష్టపోయే రైతులకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వైఎస్‌పాలెంలో ఓఎన్‌జీసీ పనులను గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నారు. సీతారాంపురం ఓఎన్‌జీసీ రిగ్ నుంచి నరసాపురం పట్టణం టెంపుల్ ల్యాండ్ వరకు గ్యాస్‌ను తరలించేందుకు పైప్‌లైన్ పనులు చేపట్టేందుకు ఓఎన్‌జీసీ అధికారులు శుక్రవారం ప్రయత్నించారు. వైఎస్‌పాలెం, రుస్తుంబాదా గ్రామస్థులు తమకు న్యాయం చేసిన తరువాతే పనులు చేపట్టాలని బైఠాయించారు. దాదాపు నాలుగు గంటల పాటు ఓఎన్‌జీసీ, రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెవెన్యూ ఓఎన్‌జీసీ అధికారులు కూడా భారీగా పోలీసులను మోహరించి పనులు చేపట్టే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులను అదుపులోకి తీసుకుని వాహనంపై భీమవరం కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. ఇటు రైతుల ఆందోళన ఉధృతం కావడంతో పనులు నిలుపుదల చేశారు.

సీతారాంపురంలో గ్యాస్ నిక్షేపాలు

నాలుగేళ్ల క్రితం ఓఎన్‌జీసీ సీతారాంపురం రిగ్‌లో గ్యాస్ నిక్షేపాలు గుర్తించారు. పైప్‌లైన్ ద్వారా సీతారాంపురం, రుస్తుంబాదా, వైఎస్‌పాలెం మీదుగా టెంపుల్ ల్యాండ్‌కు మళ్లించే ప్రయత్నం చేశారు. వ్యవసాయ భూముల్లో పైప్‌లైన్లు వేస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చేశారు. భూములు అమ్ముకుందామన్నా కొనేందుకు ఎవరూ రారని దశల వారీ ఆందోళన చేపట్టడంతో అప్పట్లో పనులు నిలుపుదల చేశారు. దాదాపు ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. తాజాగా ఇప్పుడు ఓఎన్‌జీసీ పైప్‌లైన్లు వేసేందుకు ప్రయత్నించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేసిన తరువాతే పనులు చేపట్టాలని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనను విరమింపజేశారు.



ఓఎన్‌జీసీ సిబ్బంది చేపట్టిన పైప్‌లైన్ పనులు

జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ ఆందోళన చేస్తున్న రైతులకు అండగా నిలిచారు. రైతులు, ఓఎన్‌జీసీ అధికారులతో చర్చించారు. వారి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విన్నవించారు. కొత్తపల్లి సుబ్బారాయుడు కలెక్టర్, డీఎస్పీ, జేసీలతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు న్యాయం చేసిన తరువాతే పనులు చేపట్టాలని కోరారు.

రైతులను అరెస్టు చేయలేదు : డీఎస్పీ

వైఎస్‌పాలెంలో ప్రభుత్వ భూముల్లో మాత్రమే ఓఎన్‌జీసీ పైప్‌లైన్ పనులు చేపడుతుందని, రైతులు ఎవరినీ అరెస్టు చేయలేదని డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది, తహసీల్దార్ రైతులకు అవగాహన కల్పించారన్నారు. పనులతో సమస్య ఉంటే రైతులు జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలని సూచించామన్నారు. బస్సు ఏర్పాటుచేస్తే కలెక్టర్ దగ్గరకు వెళ్లి సమస్య చెబుతామని రైతులు కోరడంతో వారి వెంట పోలీస్ సిబ్బందిని ఇచ్చి వాహనంలో పంపించామన్నారు. ఎవరినీ నిర్బంధించడం గాని, అరెస్టు చేయడం గాని జరగలేదని డీఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐలు గోవిందరాజు, అప్పలస్వామి, ఎస్సై గురవయ్య, వైఎస్ పార్థసారధి, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, ఎ.రాంబాబు, రాజు, లోకేష్, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యుత్ దీప తోరణాలతో మిరుమిట్లు గొలుపుతున్న శ్రీవారి క్షేత్రం





ఆలయ ప్రాంగణంలో పూల అలంకరణ కాంతులీనుతున్న అనివేటి మండపం

శ్రీహరి క్షేత్రంలో వెలుగులు

● ద్వారకా తిరుమలలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ● నేడు వధూవరులుగా స్వామి అమ్మవార్లు

ద్వారకాతిరుమల, మే 17: బ్రహ్మోత్సవ శోభతో చిన్న వెంకన్న క్షేత్రం వెలుగులు చిమ్ముతోంది. క్రోధి నామ సంవత్సర వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. వాహన శాల నుంచి గజ, అశ్వ, సూర్యప్రభ, చంద్రప్రభ, హంస, సింహ తదితర వాహనాలను తీసుకొచ్చి వాటిని శుభ్రం చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం చుట్టూ విద్యుద్దీప తోరణాలను సిబ్బంది అమర్చుతున్నారు. ఆలయ పరిసరాలను పూలమాలికలు, అరటి బోదెలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శనివారం ఉదయం 9.30 గంటలకు స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. ఉత్సవాలకు శ్రీకారం చుడతారు.

ఉదయం 8గంటలకు వేదపారాయణ.

రాత్రి 7 గంటలకు గజవాహనంపై శ్రీవారి తిరువీధిసేవ.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు



నాటిక పోటీల బ్రోచర్లతో దాశరథి శ్రీనివాస్

భీమవరం అర్బన్, మే 17: భీమవరంలో కళారంజని 13వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులు జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దాశరథి శ్రీనివాస్, కార్యదర్శి మెంటే పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. సోమేశ్వర, జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం నాటిక పోటీలు ప్రారంభ కానున్నాయన్నారు. పోటీలలో రాష్ట్రంలో పేరుపొందిన నాటక సంస్థల కళారులు పాల్గొంటారన్నారు. మొదటి రోజు అమరావతి ఆర్ట్స్ గుంటూరు బృందం అమృత హస్తం నాటిక, విశాఖ భద్రం ఫౌండేషన్ మట్టి పరిమళం నాటికలు ప్రదర్శించనున్నారని వివరించారు. ప్రారంభం రోజు, ఆఖరి రోజున నాటక రంగంలో విశేషంగా కృషి చేసిన ప్రముఖులను సత్కరించనున్నట్లు వారు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో నాటిక పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పోటీలలో నాటిక ప్రదర్శనలు ప్రజలందరు తిలకించాలని కోరారు. కార్యక్రమంలో కళారంజని కార్యనిర్వాహక కార్యదర్శి మల్లు సీతారాం ప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, మే 17: తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో శనివారం నుంచి 25 వరకూ 31వ జాతీయ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు, నృత్యోత్సవాలు నిర్వహించనున్నారు. బీవీఆర్ కళాకేంద్ర వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు శుక్రవారం వివరాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు నాటక పోటీలతోపాటు నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రదర్శనలు విజయవంతం చేసి కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

కేవీఎస్‌కు ఆటా ఆహ్వానం



ఏలూరు కల్చరల్, మే 17: అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) జూన్ 7,8 తేదీల్లో అట్లాంటాలో వేడుకలు నిర్వహిస్తోంది. ఈ వేడుకలకు నగరానికి చెందిన కూచిపూడి నృత్య దర్శకులు కేవీ. సత్యనారాయణను ఆటా ఆహ్వానించింది. నృత్య కళాకారులతో గోదా కల్యాణం కూచిపూడి నృత్యరూపకాన్ని ఆటా వేడుకల్లో ప్రదర్శించనున్నట్లు సత్యనారాయణ తెలిపారు. ఆగస్టు వరకు అమెరికాలో ఆయన పర్యటించనున్నారు. ఆయన ప్రతి వేసవిలో అక్కడి విద్యార్థులకు కూచిపూడి శిక్షణ ఇస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీలు ఇవ్వాలి

పాలకొల్లు, మే 17: రైల్వేలో సీనియర్ సిటిజన్స్‌కు టికెట్‌పై రాయితీ పునరుద్ధరించాలని స్థానిక సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగా నరసింహారావు కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొల్లు రైల్వే స్టేషన్స్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని, రెవెన్యూ, మున్సిపల్, బ్యాంక్‌లు, విద్యుత్ సంస్థల వద్ద సీనియర్ సిటిజన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలు తనకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని నరసింహారావు తెలిపారు.



క్యాడెట్లను పరిచయం చేసుకుంటున్న కల్నల్ బల్వేందర్ సింగ్

ట్రిపుల్‌ఐటీలో ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం

నూజివీడు టౌన్, మే 17: నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఫోర్ ఆంధ్రా బెటాలియన్ (గర్ల్స్) శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 14 పాఠశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొన్నారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ బల్వేందర్ సింగ్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా క్యాడెట్లు కృషిచేయాలన్నారు. యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్, ఆప్టికల్ ట్రైనింగ్, స్వీయ రక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. క్యాంప్ ఆఫీసర్ మేజర్ స్వాతి, క్యాంప్ అడ్జెడెంట్ కెప్టెన్ సుబ్బలక్ష్మి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో భరత్‌రాయ్ ప్రతిభ



పతకాలతో భరత్‌రాయ్

ఆగిరిపల్లి, మే 17: ఈదులగూడెం గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థి దేవరపల్లి భరత్‌రాయ్ కరాటేలో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల బాపట్లలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలలో ప్రతిభ చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈనెల 21 నుంచి 24 వరకు నేపాల్‌లో పోకరా రాష్ట్రంలో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీలలో పాల్గొననున్నట్లు విద్యార్థి తండ్రి దేవరపల్లి వేణు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కోచ్ జాస్తి విద్యాధర్, గ్రామ పెద్దలు చిట్టినేని శివరామకృష్ణ, ఈలప్రోలు సుబ్బయ్య తదితరులు ఎంపికైన విద్యార్థిని అభినందించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

పోలవరం, మే 17 : పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం నుంచి 20వ తేదీ వరకూ జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాలు, కోటి పంచ సూక్తములతో అభిషేకం సాయంత్రం 6.30 గంటలకు మండపారాధన అంకురారోపణ, ధ్వజారోహణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు, 19వ తేదీ ఉదయం 9.15 గంటలకు స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు గోదావరిలో చక్రస్నానం, సాయంత్రం 6.30 గంటలకు గోదావరిలో తెప్పోత్సవం, 8 గంటలకు పుష్పోత్సవం జరుగుతాయని ఆదివారం ఉదయం 11 గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతాయని ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలన్నారు. బహ్మశ్రీ శంకరమంచి అభిరామ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

నేడు వారపు సంత బహిరంగ వేలం

పోలవరం, మే 17 : పంచాయతీలో శనివారం ఉదయం డైలీ మార్కెట్ వారపు సంత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల వారు పంచాయతీ బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. గ్రామంలో బహిరంగ వేలం గురించి మైక్ ప్రచారం నిర్వహించారు.

నేడు వాసవీ మాత జయంత్యుత్సవం

ఏలూరు కార్పొరేషన్, మే 17: ఆర్య వైశ్యుల కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని శనివారం నగరంలోని అన్ని ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు, కలశాలతో ఆర్యవైశ్య కన్యలతో, మహిళా ప్రతినిధులతో, కుంకుమపూజలు జరిపేందుకు సన్నాహాలు చేశారు. అగ్రహారంలోని నగరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవాసవీ అమ్మవారి ఆలయం వద్ద, పెరుగు చెట్టు సెంటర్‌లోని కన్యకాపరమేశ్వరి సత్రం వద్ద పూజలు అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఆర్య వైశ్య సంఘాలు ఏర్పాట్లు చేశారు.

జూన్ 14 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

ఏలూరు స్పోర్ట్స్, మే 17: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంస్థ చీఫ్ కోచ్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో ఫుట్ బాల్, ఇండోర్ స్టేడియంలో నైట్ లిఫ్టింగ్, హ్యాండ్‌బాల్, పోలసానపల్లి సోషల్ వెల్ఫేర్ గరల్స్ స్కూల్లో అథ్లెటిక్స్, ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్లో టేబుల్ టెన్నిస్, ఏలూరు వీజీటీఓ స్కూల్లో వెయిట్ లిఫ్టింగ్, ఏలూరు వీఎస్ఏ స్విమ్మింగ్ పూల్లో ఈత పోటీలు, ఇండోర్ స్టేడియం స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్, ఏఎస్ఆర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్, జంగారెడ్డిగూడెం యర్రకాలువ రిజర్వాయర్‌లో వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 14వ తేదీ వరకు జరిగే శిక్షణ శిబిరాలను ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి సెల్ నెంబర్ 98663 17326లో సంప్రదించాలన్నారు.

26న అంతర్జాతీయ శతాధిక పద్యకవుల సమ్మేళనం

ఏలూరు కల్చరల్, మే 17: వైఎంహెచ్ఏ ప్రాంగణంలో శుక్రవారం శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం శ్రీహరికోటి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ ప్రధాన కార్యదర్శి, జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ పి.పార్థసారధి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 26న వైఎంహెచ్ఏలో జరిగే అంతర్జాతీయ పద్యకవుల సమ్మేళనం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కస్తూరిరావు, మహిళా అధ్యక్షురాలు శ్యామల, కార్యదర్శులు ఎంజే సుజయ్‌కృష్ణ, గురుశర్మ, జి.ఐజక్, నాగేశ్వరరావు, అనురాధ, వీవీఎస్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వత్తిడి తగ్గిస్తే రక్తపోటు అదుపులో ఉంటుంది



చింతలపూడి, మే 17: వత్తిడి తగ్గిస్తే రక్తపోటు అదుపులో ఉంటుందని, ఇది మీ దరికి రాదని, యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ నరేష్ అన్నారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డేని పురస్కరించుకుని ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ చాలామంది చిన్న వయస్సులో రక్తపోటుకు గురవుతున్నారని, దీనికి ప్రధాన కారణం సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, నిద్రలేమి, మానసిక వత్తిడికి గురికావడమే అన్నారు. వీటిని అధికమిస్తే బీపీ, షుగర్ వంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవడం సాధ్యమే అన్నారు. గర్భవతులు ప్రతి నెల పరీక్షలు చేయించుకోవాలని, అధిక రక్తపోటు ఉన్నవారు హైరిస్క్ గుర్తించి ప్రత్యేక సూచనలు ఇస్తామని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని ప్రత్యేక వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలో వ్యాధిపై అవగాహన చేసుకుంటే మంచిదన్నారు. ఈ సదస్సులో వైద్యాధికారి డాక్టర్ ఎస్.గీత, రమణమ్మ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

టి.నరసాపురం, మే 17 : అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విస్సంపల్లి సిద్ధూ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం వెంకటగిరి టౌన్ క్రాస్ రోడ్ రైల్వేస్టేషన్ దగ్గర గల అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి సంఘ వ్యతిరేఖ చర్యలకు తావులేదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సిద్ధూ డిమాండ్ చేశారు.

ఆయుర్వేద ఆసుపత్రిని సందర్శించిన జాతీయ బృందం



ఉంగుటూరు, మే 17 : ఆయుర్వేద వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ కమిటీ సభ్యుల బృందం పేర్కొంది. తమిళనాడు నుంచి శుక్రవారం వచ్చిన డాక్టర్ బి.కొత్త నయాగి, కమిటీ నోడల్ అధికారి డాక్టర్ వి.నీలిమ ఉంగుటూరు ఆయుర్వేద ఆస్పత్రిని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కస్తూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఉత్సవ విగ్రహాలు అందజేత



కామవరపుకోట, మే17 : జీలకర్రగూడెం మెట్ట వద్దగల శ్రీ భూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి కళ్యాణ ఉత్సవాల కోసం ఆడమిల్లి గ్రామానికి చెందిన వేములసాయిబాబు, మల్లిక దంపతులు రూ.30 వేలతో తయారు చేయించిన పంచలోహ ఉత్సవమూర్తుల విగ్రహాలను శుక్రవారం అందజేశారు.

సామూహిక రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్. మే 17. వైశాఖ మాసంలోని రెండో శుక్రవారం పర్వదినం సందర్భంగా అంబికాదేవి అమ్మవారి సన్నిధిలో ఆలయ ప్రధానార్చకుడు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన జరిపించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి, ప్రత్యేక అలంకరణ నిర్వహించి విశేష హారతులు ఇచ్చి భక్తులకు దర్శనం ఇచ్చారు. బావి శెట్టివారిపేటలోని శ్రీకనక దుర్గాంబ అమ్మవారి సన్నిధిలో ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మ మహిళలలో సామూహిక కుంకుమ పూజలు చేయించారు.

త్వరలోనే ఉద్యోగులను సత్కరిస్తాం

జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఏలూరు కలెక్టరేట్, మే 17: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులను త్వరలోనే సత్కరించనున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించి నందుకు గాను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు తదితరులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పోలిం టగ్ సిబ్బంది కష్టపడి పని చేశారని కలెక్టర్ అభినందించారు. స్వీప్ ద్వారా ఓటర్లను చైతన్యం చేసి పోలింగ్ బూత్ వరకు వచ్చేలా సౌకర్యాలు కల్పించడం వలనే పోలింగ్ శాతం భారీగా పెరిగిందని ఉద్యోగులు కలెక్టర్‌ను ప్రశంసించారు. రెమ్యూనరేషన్ విషయం కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, పోలింగ్ శిక్షణ, పోలింగ్ తదుపరి ఐదు రోజులు రెమ్యూనరేషన్ ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తాలూకా అధ్యక్షుడు ఇ.శ్రీధర్‌రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, నాయకులు ఎన్.శ్రీనివాస్, ఎన్.నాయుడు, నరేంద్ర, పి.శ్రీనివాస్, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను అభినందిస్తున్న ఎన్జీవో నాయకులు



రోడ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

పనుల్లో నాణ్యత ఉండాలి

నగరంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసిన రహదారుల ప్యాచ్ వర్క్ పనులను ఆ శాఖ ఎస్ఈ జి.జాన్‌మోషేతో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ పరిశీలించారు. పట్టణంలో ఎండీఆర్ నిధులు కోటి రూపాయలతో నిర్మించిన ఏలూరు, కైకలూరు, చాటపర్రు, వీకే రోడ్డు, క్లాక్ టవర్ నుంచి ఏలూరు టౌన్ వరకు నిర్మించిన నాలుగు రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు, లింక్ రోడ్ల పనులు పూర్తి చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఏలూరు, కైకలూరు వెళ్లేరోడ్డు, పాత బస్టాండు నుంచి గజ్జెలవారిచెరువు వరకు వేసిన ప్యాచ్ వర్క్‌లను కలెక్టర్ పరిశీలించారు. స్థానికులను రోడ్డు పనులపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ గోవిందమోహన్, ఈఈ వైవీ కిషోర్, బాహుజి, ఏఈ శేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువను

శుభ్రం చేశారు



ఏలూరు టూ టౌన్, మే 17: నగరంలోని 45వ డివిజన్‌లో దుర్గంధంగా మారిన డ్రైన్ మున్సిపల్ అదికారులు శుభ్రం చేశారు. శుక్రవారం దుర్గంధం భరించలేకపోతున్నాం అని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు డ్రైన్‌ను శుభ్రం చేశారు. దీంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రతిరోజు డ్రైన్‌ను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



కొవ్వలిలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కైకరంలో స్వామి వారిని దర్శించుకుంటున్న విశ్వ బ్రాహ్మణులు

దెందులూరు,మే 17 : భవిష్యత్తును ముందుగా చెప్పడం తో పాటు కాల జ్ఞానాన్ని రచిం చిన శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్స వాలు శుక్రవారం కొవ్వలిలో ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిలోకి వెళ్లిన రోజు సందర్భంగా చౌదరి పేటలో ఉన్న స్వామి వారి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం, కొవ్వలి గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. భక్తులకు కాలజ్ఞానం పుస్తకాలను, పానకం, అల్పాహారం అందజేశారు. స్వామి వారిని టీడీపీ నేత వడ్లపట్ల పండు,గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుత్తా రాజా దర్శించుకున్నారు.

కైకరంలో...

ఉంగుటూరు,మే 17: ఉంగుటూరు మండలం కైకరం ఆరుగుళ్ల సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి వారి ఆరాధనోత్సవాలలో భాగంగా స్థానిక విశ్వ బ్రాహ్మణుల సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రజకుల సమస్యలపై స్పందించాలి



ఏలూరు రూరల్, మే 17: ఉమ్మడి జిల్లాలోని రజక వృత్తిదారుల సమస్యలపై అధికారులు పరిష్కరించాలని రజక జన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. ఏలూరులోని సంఘ భవనంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ రజకుల చెరువులు పరిస్థితి పై ఆరా తీశారు. చాలాచెరువులు పూడికలతో నిండిపోయాయని, ఎక్కువగా ఆక్రమణలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి హామీ పథకంలో చెరువుల పూడికతీతను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కానూరు అగ్రహారంలో రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లీజు వేయాలని కోరారు. అనంతరం కానూరు, రజక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.వెంకన్న, ఉపాధ్యక్షులుగా రాంబాబు, కార్యదర్శిగా సాంబయ్య, నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నూతన కమిటీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌పాత్ పై ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ఏలూరు టూటౌన్, మే 17: ఫుట్ పాత్‌లు ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి పై మున్సిపల్ అధికారులు కొరడ ఝులిపించారు. సీఆర్ రెడ్డి కాలేజీ ప్రహరీని అనుకొని వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను శుక్రవారం తొలగించారు. దుకాణదారుల వ్యాపారాల వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలు ఫిర్యాదులు రావడంతో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. కూరగాయాల దుకాణాలు, నర్సరీ, పండ్ల కోట్లు, ఇతర బడ్డీ కొట్లనుతొలగించారు. ముందుగా చెప్పకుండా, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించటం అన్యాయమని వ్యాపారుల లబోదిబోమంటున్నారు. వేరే ఎక్కడైన స్థలాలు చూపించి ఆదుకోవాలని కోరుతున్నారు.

టెన్త్ విద్యార్థులకు మానవతా అవార్డులు

భీమవరం అర్బన్, మే 17: మార్చి 2024 పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన భీమవరం మండల, పట్టణ పరిధిలోని 30 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ భీమవరం త్యాగరాజ భవనంలో మానవతా ప్రతిభా అవార్డులు అందజేస్తున్నామని ఆ సంస్థ డైరెక్టరు ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సాయుధ బలగాల కవాతు



ఏలూరు క్రైం, మే 17 : సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతి భద్రతలను కాపాడేందుకు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏలూరు వన్ టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్, ఎస్ఐలు వారి సిబ్బంది సాయుధ బలగాలు శుక్రవారం రాత్రి వన్ టౌన్‌లోని పలు ప్రాంతాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరైనా ప్రజా శాంతికి భంగం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారి సమాచారాన్ని డయల్-112 ద్వారా తెలియజేయాలని డీఎస్పీ శ్రీనివాసులు కోరారు. ఏలూరు వడ్డేర గూడెంలో శుక్రవారం రాత్రి కార్డాన్ చర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐ రాజశేఖర్, ఎస్ఐలు లక్ష్మణబాబు, నవీన్‌బాబు, ఏలూరు రూరల్ ఎస్ఐ రాజారెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

లలితా పీఠంలో కుంకుమ పూజలు

కామవరపుకోట మే17. వైశాఖమాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీపీఠంలో స్వామివారికి అమ్మవారికి తొలుత అభిషేకం అనంతరం అలంకారం, విశేష హారతులతో ఆరాధించారు.

గోతులతో ప్రమాదాలు

భీమడోలు, మే 17 : గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలతో ధ్వంసమై ప్రమాదాలకు కారణమవుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు ధ్వంసమైన ప్పటికీ మరమ్మతులు చేపట్టే నాధుడే కరువయ్యాడు. ఈ రహదారి గుండా ద్వారకాతిరుమలకు నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో ద్విచక్ర వాహనాలు, బస్సులు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడని ప్రయాణికులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. రోడ్డు వేయక పోయినా కనీసం



గుంతలైనా పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

కురిసింది వాన..

పెదవేగి, మే 17 : మండే ఎండలు, ఉక్కబోతతో అల్లాడిన ప్రజలకు చిరుజల్లులతో ఊరట లభించింది. వారం రోజులుగా మబ్బులతో ఊరించి, శుక్రవారం ఉదయం నుంచి చిరు జల్లులు పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అల్ప పీడన ద్రోణి ప్రభావంతో పడిన వర్షంతో ప్రజలు వేసవి నుంచి ఉపశమనం పొందారు. వేసవి ఎండలతో నీటి తడులు సక్రమంగా అందని ఉద్యానపంటలకు ఈ వర్షం మేలు చేస్తుంది. కొన్నిచోట్ల ధాన్యం చేలల్లో ఉన్నాయి. అవి తడిస్తే నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంటుందని రైతులు అంటున్నారు. కాగా రహదారుల్లో ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. గోపన్నపాలెం-బాదరాల రోడ్డులో దిబ్బగూడెం దగ్గర గుంతల్లో నీరు నిలిచి, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. రహదారిపై నీటి మడుగులు ఏర్పడడంతో ఆ గుంతలను దాటడానికి ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు.

బూత్‌ల వారీగా పోలింగ్ ఇలా

బుట్టాయగూడెం మండలం

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
131	కామవరం	963	864	89.72
132	లంకపాకల	1056	982	92.96
133	దొరమామిడి	1428	1101	77.10
134	దొరమామిడి	1458	1133	77.71
135	గురుఉమిలి	586	524	89.42
136	గుళ్ళపూడి	302	280	92.72
137	దుద్దుకూరు	341	318	93.26
138	తెల్లంవారిగూడెం	700	615	87.86
139	అంతర్వేదిగూడెం	951	813	85.49
140	కాకులవారిగూడెం	630	574	91.11
141	పందిరిమామిడిగూడెం	781	698	82.00
142	బుట్టాయగూడెం	1142	832	72.85
143	బుట్టాయగూడెం	1134	780	68.78
144	బుట్టాయగూడెం	1117	824	73.77
145	బుట్టాయగూడెం	1282	1045	81.59
146	వీరన్నపాలెం	1080	927	85.83
147	సీతప్పగూడెం	797	690	86.57
148	పెదకాపవరం	1050	932	88.76
149	బుద్దులవారిగూడెం	715	610	85.31
150	ముప్పినవారిగూడెం	702	548	78.06
151	ముప్పినవారిగూడెం	643	533	82.89
152	కోయఅంకంపాలెం	996	893	89.66
153	చింతలగూడెం	539	624	86.38
154	పులిరాముడుగూడెం	1072	897	83.68
155	గుమ్ములూరు	159	143	89.94
156	రెడ్డికోపల్లి	398	366	91.96
157	ఇటికలకుంట	843	759	90.04
158	అచ్చియ్యపాలెం	1164	1022	87.80
159	రామన్నగూడెం	968	837	86.47
160	ఎన్ఆర్ పాలెం	855	727	85.03
161	రామన్నగూడెం	1,111	927	83.44
162	కంద్రికగూడెం	376	301	80.05
163	కోయరాజమండ్రి	1,125	949	84.36
164	కొమ్ముగూడెం	905	747	82.54
165	కొమ్ముగూడెం	553	472	85.35
166	బూసరాజుపల్లి	949	740	77.98
167	పైడావారిగూడెం	684	549	80.26
168	పాలకుంట	678	606	89.38
169	వెలుతురువారిగూడెం	483	432	89.26
170	వెస్ట్ రేగులకుంట	643	574	89.27
171	బెడదనూరు	475	424	89.26
172	గణపవరం	1120	946	84.46
173	గణపవరం	1014	839	82.74
174	తూటికుంటకాలనీ	512	441	86.13
175	జైనవారిగూడెం	554	503	90.79
176	మర్లగూడెం	656	574	87.50
177	చీమలవారిగూడెం	744	650	87.37
178	కేఆర్ పురం	549	358	65.21
179	కేఆర్ పురం	559	400	71.56
180	రాజానగరం	715	620	86.71
181	రాజానగరం	836	748	89.47
182	కామయ్యకుంట	763	655	85.85
183	పండుగూడెం	379	343	90.50
184	చింతపల్లి	707	635	89.82

చింతలపూడి మండలం

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1.	మేడిశెట్టివారిపాలెం	672	635	95.56
2.	చింతంపల్లి	792	737	97.07
3.	సీతానగరం	1012	806	84.82
4.	సీతానగరం	1077	917	84.33
5.	సీతానగరం	936	826	88.82
6	అల్లిపెల్లి	849	786	92.03
7.	మూటనముద్రం	1177	1071	94.86
72	మెతుకుమిల్లివారిగూడెం	224	213	95.24
73	యర్రగొండపల్లి	1285	1104	85.63
74	యర్రగొండపల్లి	1273	1054	81.90
76	యర్రగొండపల్లి	1199	1009	83.27
77	పట్టాయిగూడెం	938	876	90.76
78	గురుపట్లగూడెం	591	562	95.03
79	లింగగూడెం	1138	1025	88.66
80	రాఘవాపురం	813	727	89.00
81	రాఘవాపురం	878	776	88.99
82	రాఘవాపురం	1226	1120	92.44
83	రాఘవాపురం	607	564	94.63
84	కమలాపురం	235	219	91.60
85	డీఎస్‌రావుపేట	863	799	82.44
86	నామవరం	784	729	93.78
87	నామవరం	751	675	91.78
88	కొమ్ముగూడెం	789	761	95.87
119	రేచర్ల	1126	1008	88.39
119	రేచర్ల	1319	830	67.02
120	రేచర్ల	926	804	89.18
121	శెట్టివారిగూడెం	1042	942	89.04
122	వెంకటాపురం	881	782	88.00
123	కాంతంపాలెం	503	461	89.77
124	వెంకటాద్రిగూడెం	1072	974	89.80
125	యండపల్లి	1186	1111	99.15
126	మల్లేశ్వరం	1132	1029	91.23
127	శివపురం	899	820	87.05
128	శివపురం	849	761	86.73
129	గణిజర్ల	849	754	89.64
130	గణిజర్ల	765	717	93.33
142	పొనుకుమాడు	753	673	86.36
143	పొనుకుమాడు	968	891	92.03
144	ఉర్లగూడెం	843	798	92.69
145	పాతచింతలపూడి	1249	1090	86.78
146	సమ్మెటవారిగూడెం	595	545	92.76
147	చింతలపూడి	1282	828	67.85
148	చింతలపూడి	1270	872	62.57
149	చింతలపూడి	986	717	77.89
150	చింతలపూడి	1431	885	61.01
151	చింతలపూడి	1360	946	71.76
152	చింతలపూడి	782	476	61.69
153	చింతలపూడి	1090	784	73.17
154	చింతలపూడి	1077	703	63.39
155	చింతలపూడి	1033	657	62.84
156	చింతలపూడి	1261	815	58.15
157	చింతలపూడి	840	673	58.23
158	చింతలపూడి	1185	979	82.09
159	చింతలపూడి	859	708	64.60
160	చింతలపూడి	730	519	69.15
161	చింతలపూడి	856	617	70.56
162	చింతలపూడి	1305	717	49.39
163	చింతలపూడి	1170	875	78.32
164	చింతలపూడి	1259	931	76.83
165	నాగిరెడ్డిగూడెం	1033	831	83.85
166	మల్లాయిగూడెం	1041	956	89.87
167	పోతునూరు	801	714	89.35
168	కనిపెడ	651	601	91.32
169	ప్రగడవరం	1194	1016	78.49
170	ప్రగడవరం	1211	104	89.17
171	ప్రగడవరం	776	684	85.14
172	ప్రగడవరం	820	650	77.09
173	ప్రగడవరం	1096	940	83.92
174	ప్రగడవరం	1200	1070	88.52
175	వెలగలపల్లి	1088	922	83.10
176	వెలగలపల్లి	721	627	86.61
177	శంకుచక్రపురం	1017	840	82.76
206	తిమ్మిరెడ్డిపల్లి	945	915	97.01
207	యర్రంపల్లి	1106	969	87.52
208	యర్రంపల్లి	882	716	77.47
209	యర్రంపలి	1152	1041	91.91
మొత్తంగా		74,786	62,385	83.69

కామవరపుకోట మండలంలో 81.32. శాతం



జలపవారి గూడెంలో క్యూలో ఉన్న గ్రామస్తులు

కామవరపుకోట, మే17: మండలంలో ఏర్పాటు చేసిన 49 పోలింగ్ కేంద్రాల పరిధిలో 51,100 మంది ఓటర్లలో 41,556 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 81.32 శాతం నమోదైంది. అంకాలంపాడు పంచాయతీ జలపవారిగూడెంలో 197 బూత్‌లో 1189 మంది ఓటర్లు ఉండగా 1062 మంది పోలింగ్‌లో పాల్గొనడంతో 89.32 శాతం నమోదైంది. ఇదే గ్రామంలో 198 బూత్‌లో 1218 మంది ఓటర్లకు 1075 మంది ఓటింగ్ లో పాల్గొనడంతో 88.26 శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు బూత్‌లలో పోలింగ్ 7 గంటలకు ప్రారంభమయిన పోలింగ్ నిర్వహణారం 14వ తేదీ తెల్లవారుజాము 4 గంటల వరకు జరిగింది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఏలూరు క్రైం, మే 17 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైల్వే ఉద్యోగి కుటుంబానికి రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని మజ్దూర్ యూనియన్ నాయకులు స్పష్టం చేసి తక్షణ ఆర్థిక సాయంగా రూ.లక్షలు మృతుడి తల్లికి అందించారు. భీమడోలు 5వ యూనిట్‌లో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్న పలాసనకు చెందిన బద్రిలోకేష్ మోటారు సైకిల్‌పై భీమడోలు మండలం సూరప్పగూడెం రహదారిపై ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం వెళ్తుండగా మరో మోటారు సైకిల్ వెనుక నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహానికి శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఏలూరు మజ్దూర్ యూనియన్ కార్యదర్శి ప్రణోజ్, మాజీ సెక్రెటరీ అప్పారావు, చైర్మన్ పాన్‌రాజు కుమార్, డివిజన్ సెక్రెటరీ లీల పలువురు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడే మృతుడి తల్లికి రూ.లక్షల నగదును డివిజన్ సెక్రెటరీ లీల అందించారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని వారు ఆత్మస్థైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు బ్రాంచ్ కార్యదర్శి ప్రణోజ్, జోనల్ సెక్రెటరీ శంకరరావు, పీసీ ఇబ్రహీంలు పాల్గొన్నారు. వారికి మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం వార్తలు

బస్సులో చోరీ

ఏలూరు క్రైం, మే 17 : బస్సులో ప్రయాణిస్తున్న ఒక మహిళ లగేజీ నుంచి బంగారపు చైన్, నగదు అపహరణకు గురైందని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు రామచంద్రరావుపేటనకు చెందిన తూట అరుణ ఈనెల 13వ తేదీన ఏలూరు కొత్త బస్టాండ్ నుంచి కైకలూరు వెళ్ళే నిమిత్తం బస్సు ఎక్కారు. ఏలూరు దాటిన తరువాత ఆమె లగేజీలోని ఒక బంగారపు చైను, ఐదు వేల నగదు కనిపించలేదు. దీంతో శుక్రవారం ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాన్స్‌ఫారమ్‌లో రాగి వైరు చోరీ

ఏలూరు క్రైం, మే 17 : పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫారమ్‌ను పగులగొట్టి దొంగలు రాగి వైరును అపహరించారంటూ ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాల పరిధిలో రైతు చింతయ్య పొల్లాల్లో ఉన్న ట్రాన్స్ ఫారమ్‌ను గుర్తు తెలియని దొంగలు ఈనెల 8వ తేదీ రాత్రి పగులగొట్టి రాగివైరు అపహరించుకుపోయారు. ట్రాన్స్‌కో ఎఇ పి శ్రీనివాస్ ఏలూరు త్రి టౌన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెరువును తలపిస్తున్న కొత్తూరు - గుర్వాయిపాలెం రహదారి


అధ్వానంగా కాళ్లపాలెం - తాడినాడ రహదారి


కైకలూరులో అంతర్గత రహదారి దుస్థితి


ముదినేపల్లి - సింగరాయపాలెం రోడ్డులో గోతుల్లో నిలిచిన నీరు

మోక్షమెన్నడో..?

▸అడుగడుగునా గోతులు ▸కొద్దిపాటి వర్షానికే రహదారులు జలమయం ▸నరకం చూస్తున్న ప్రజలు

రహదారులతో ప్రజల పాట్లు మళ్లీ మొదలయ్యాయి. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు నిలిచిపోయింది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో తమ పరిస్థితి షరా మామూలే అని వాహన చోదకులు వాపోతున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వం రహదారులను పట్టించుకోకపోవడంతో తాము నరకం చూస్తున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలిదిండి, మే 17 : మండలంలో పలు ఆర్‌అండ్‌బీ రహదారులు పెద్ద గోతులు పడి అధ్వానంగా మారాయి. కొత్తూరు - గుర్వాయి పాలెం ప్రధాన రహదారి నాలుగు కిలోమీటర్ల మేర పెద్ద గోతులు పడటంతో వర్షపు నీరు గోతుల్లో నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. మూల్లంక - పెదలంక ప్రధాన రహదారిని ఆరు కిలోమీటర్ల మేర ఎక్స్‌కవేటర్‌తో గోతులను చదును చేసి వదిలేయటంతో కంకర పైకి లేచి మళ్లీ గోతులు పడ్డాయి. వర్షానికి గుంతల్లో నీరు ఉండటంతో వాహనదారుల వెతలు వర్ణనాతీతం. ఈ రహదా రిపై ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగించటానికి ఆర్టీసీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. యడవల్లి - మట్టగుంట ప్రధాన రహదారిపై పెద్ద గోతులు పడటంతో వాహనాలు గోతుల్లో దిగబడుతున్నాయి. దీంతో గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనదారులు ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలంటేనే హడలిపోతున్నారు. వర్షానికి గోతుల్లో నీరు ఉండటంతో అవి ఎంత లోతు ఉన్నాయో అంచనా వేయలేక ద్విచక్ర వాహన దారులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. కాళ్లపాలెం-తాడినాడ ప్రధాన రహదారి గోతుల మయంగా మారింది. చినతాడినాడ వయా పోతుమర్రు, కలిదిండి రహదారి గోతులు పడి కంకర పైకి లేచిపోవటంతో వర్షానికి బురద కయ్యగా మారింది. ఈ ఐదేళ్లలో రహదారుల మరమ్మతులు పట్టించు కోకపోవటం వల్లే రహదారులు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయని కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తతం చేస్తున్నారు. రహదారిపై ఉన్న గుంతల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉంటున్నప్పటికీ వాటికి గాడి పెట్టి వర్షపు నీటిని తొలగించకపోవటంతో వాహనాలు దిగబడిపోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రహదారు లు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెంచికలమర్రు-కొల్లేటికోట రహదారిపై పాట్లు

కైకలూరు: వేసవిలో కురిసిన వర్షాలకే గ్రామీణా ప్రాంతాల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. రహదారుల అభివృద్ధిలో ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో ఆగ్రహం వ్యక్తతం చేస్తున్నారు. వేసవిలో కురిసిన వర్షానికే ఈ పరిస్థితి నెలకొంటే రానున్న వర్షాకాలంలో ఇంకెలా ఉంటుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కైకలూరు మండలం పెంచికలమర్రు నుంచి కొల్లేటికోట వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారికి అధికారులు మరమ్మతులు నిర్వహించకుండా ఎక్సకవేటరుతో రోడ్డును ధ్వంసం చేసి వదలివేశారు. రహదారిపై ఉన్న రాళ్ళపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు జారి పడిపో తున్నారు. నెలల తరబడి ఈ విధంగా వదిలివేయడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పెద్దింటి అమ్మవారి భక్తులు సైతం ఈ రహదారితో ఇక్కట్లకు గురవుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు రహదారులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కనీసం గోతుల్లో నీటిని బయటకు పంపండి..

ముదినేపల్లి: చిన్నపాటి వర్షానికే ముదినేపల్లి ప్రాంత ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి ముదినేపల్లి - సింగరాయపాలెం, కోరుకొల్లు, చేవూరు, గుడ్లవల్లేరు రహదారులతోపాటు ముదినేపల్లి సెంటర్‌లోని రోడ్డు, సర్వీస్ రోడ్డు అధ్వాన్నంగా తయారయ్యాయి. పై రహదారుల్లో అడుగడుగునా ఉన్న గోతుల్లో నీరు నిలిచి ఉంది. వడాలి స్తంభం చెరువు, విశ్వనాథ్రిపాలెం, బొమ్మినంపాడు గ్రామాల వద్ద గోతుల్లో నీరు నిలవటంతో వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. గోతుల్లో నిలిచిన నీటిని బయటికు పంపేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. వర్షపు నీరు రోజుల తరబడి గోతుల్లో నిలిచి ఉండటంతో రోడ్లు ధ్వంసమై మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.


శంకు చక్రాలు, శివలింగాన్ని పుష్పాలతో అలంకరించిన దృశ్యం.. పూజలందుకున్న స్వామివారు.. మహిళల మూలమంత్ర పఠనం

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

కైకలూరు, మే 17: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కైకలూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున పాల్గొని 108 సార్లు మూలమంత్రాన్ని పఠించారు. అనంతరం శివలింగం, శంకు చక్రాలను పూలతో అలంకరించి దీపోత్సవాన్ని జరిపారు. రాత్రి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర సినిమాను ప్రదర్శించారు. ఆలయ అధ్యక్షుడు టేకు వెంకట సత్యనారాయణ, కార్యదర్శి సింహాద్రి ప్రభాకరరావు, ట్రెజరర్ అనుపోజు నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ తుపాకుల సుబ్బారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


చిన్నంపేటలో జ్వరాలపై ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



దిగవల్లిలో డెంగీపై అవగాహన ర్యాలీ

ముందు జాగ్రత్తలు పాటించండి

చాట్రాయి, మే 17: వర్షాలు పడుతున్నందున ప్రతి ఒక్కరూ జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని నూజివీడు డివిజన్ డీఎం అండ్‌హెచ్‌వో జగన్మోహనరావు, తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీ, ఎంపీడీవో మంగా కుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నంపేటలో కొంత మందికి జ్వరం వచ్చి తగ్గిన తరువాత, కాళ్ళు చేతులు నొప్పులు, వాపులు వచ్చినట్లు తెలియటంతో చాట్రాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించి, పారిశుధ్య చర్య లు చేపట్టారు. అధికారులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమలు పుట్టకుండా కుట్టకుం డా జాగ్రత్త వహించాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పరసా చెన్నారావు, సర్పంచ్ ధనలక్ష్మి, సీహెచ్‌వో రమణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మండలంలోని పోతనపల్లిలో శుక్రవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో 368 మంది వైద్య సేవలు అందించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు పి. నిస్సీ, బెన్నీ మోజెస్, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసుల రెడ్డి, దుర్గాప్రసాద్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

నూజివీడు టౌన్, మే 17: జాతీయ డెంగీ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని నూజివీడు మండలం దిగవల్లి పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో డెంగీపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సునందకుమారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసు కోవాలని, తద్వారా దోమల పెరుగుదలను అరికట్టి డెంగీని అరికట్టవచ్చన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.యలమంద, దిగవల్లి పీహెచ్‌సీ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


క్యాడెట్లను పరిచయం చేసుకుంటున్న కల్నల్ బల్వీందర్ సింగ్

ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం

నూజివీడు టౌన్, మే 17: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫోర్ ఆంధ్రా బెటాలియన్ (బాలికల) శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 14 పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్లను ఉద్దేశించి క్యాంప్ కమాండెంట్ కల్నల్ బల్వీందర్‌సింగ్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా క్యాడెట్లు కృషి చేయాలన్నారు. ఈ శిబిరంలో క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్, ఆప్టికల్ ట్రైనింగ్, స్వీయ రక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. క్యాంప్ ఆఫీసర్ మేజర్ స్వాతి, క్యాంప్ అడ్జెటెంట్ కెప్టెన్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, మే 17: సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా నూజివీడు పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా తిరువూరు రోడ్డు, పెద్ద గాంధీబొమ్మ, చిన్న గాంధీబొమ్మ, బ్యాంక్ స్ట్రీట్, ఎంప్లాయిస్ కాలనీ, ఆర్‌ఆర్ పేట, మొగలిచెరువు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు భరత్‌రాయ్



ఆగిరిపల్లి, మే 17: ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థి దేవరపల్లి భరత్‌రాయ్ ఇటీవల బాపట్లలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి 24 వరకు నేపాల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొననున్నట్లు విద్యార్థి తండ్రి దేవరపల్లి వేణు తెలిపారు. ఈ సందర్భం గా శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కోచ్ జాస్తి విద్యాధర్, గ్రామ పెద్దలు చిట్టినేని శివరామకృష్ణ, ఈలప్రోలు సుబ్బయ్య తదితరులు ఎంపికైన విద్యార్థిని అభినందించారు.

ప్రేరణ ఉత్సవ్‌కు అన్వేష్ ఎంపిక



కలిదిండి, మే 17 : జాతీయ స్థాయి ప్రేరణ ఉత్సవ్‌కు ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి కత్తుల అన్వేష్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్ తెలిపారు. 2024 ఏప్రిల్‌లో జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రేరణ ఉత్సవ్‌లో తన నైపుణ్యాన్ని ప్రదర్శించటంతో జాతీయ స్థాయి ప్రేరణ ఉత్సవ్‌కు ఎంపిక చేశారన్నారు. 2024 జూలైలో గుజరాత్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అన్వేష్‌కు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

జన సైనికుడికి ఆర్థిక సాయం



ముసునూరు, మే 17: మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన జన సైనికుడు ముత్యాల శివకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకుని మంచానికే పరిమితమవడంతో శుక్రవారం జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, జనసేన నాయకులు శివకృష్ణను పరామర్శించి, రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నూజివీడు టౌన్ నాయకులు ముత్యాల కామేష్, ముమ్మల నేని సునీల్‌కుమార్, నాయుడు శ్రీను, ఎస్‌కే బాజి, ముసునూరు మండల అధ్యక్షులు అబ్బూరి రవి కిరణ్, ముత్యాల స్వామి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ దీప తోరణాలతో మిరుమిట్లు గొలుపుతున్న శ్రీవారి క్షేత్రం


ఆలయ ప్రాంగణంలో పూల అలంకరణ

శ్రీహరి క్షేత్రంలో వెలుగులు


కాంతులీనుతున్న అనివేటి మండపం

- ద్వారకా తిరుమలలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- నేడు వధూవరులుగా స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల, మే 17: బ్రహ్మోత్సవ శోభతో చిన్న వెంకన్న క్షేత్రం వెలుగులు చిమ్ముతోంది. క్రోధి నామ సంవత్సర వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. వాహన శాల నుంచి గజ, అశ్వ, సూర్యప్రభ, చంద్రప్రభ, హంస, సింహ తదితర వాహనాలను తీసుకొచ్చి వాటిని శుభ్రం చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం చుట్టూ విద్యుద్దీప తోరణాలను సిబ్బంది అమర్చుతున్నారు. ఆలయ పరిసరాలను పూలమాలికలు, అరటి బోదెలు, మామిడి తోరణాలతో అలంకరిం చారు. ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శనివారం ఉదయం 9.30 గంటలకు స్వామి అమ్మవార్లను వధూవ రులుగా అలంకరిస్తారు. ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఉదయం 8గంటలకు వేదపారాయణ. రాత్రి 7 గంటలకు గజవాహనంపై శ్రీవారి తిరువీధిసేవ.

చాట్రాయి మండలంలో బూత్‌ల వారీ పోలింగ్ ఇలా..

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1	కృష్ణారావుపాలెం	745	697	93.56
2	చనుబండ	1002	828	82.63
3	,,	564	508	90.07
4	,,	800	723	90.38
5	సూరంపాలెం	872	734	84.17
6	డిటో	840	730	86.90
7	సి. గుడిపాడు	1083	966	89.20
8	డిటో	633	583	92.10
9	డిటో	586	510	87.03
10	డిటో	871	827	94.95
11	పర్వతాపురం	916	880	96.07
12	చిన్నంపేట	911	821	90.12
13	డిటో	1003	903	90.03
14	డిటో	866	768	88.68
15	కోటపాడు	892	812	91.03
16	డిటో	906	847	93.49
17	డిటో	829	760	91.68
18	చీపురుగూడెం	1041	978	93.95
19	డిటో	1047	975	93.12
20	మంకొలు	572	499	87.24
21	పోతనపల్లి	985	879	89.24
22	డిటో	935	832	88.98
23	బూరుగ్గూడెం	762	662	86.88
24	డిటో	709	652	91.96
25	చాట్రాయి	1049	760	72.45
26	డిటో	932	761	81.65
27	డిటో	883	750	84.94
28	డిటో	894	770	86.13
29	పోలవరం	1100	986	89.64
30	డిటో	766	660	86.16
31	డిటో	1018	922	90.57
32	డిటో	833	732	87.88
33	ఆరుగొలనుపేట	827	794	96.01
34	డిటో	612	583	95.26
35	జనార్ధనవరం	944	854	90.47
36	డిటో	942	866	91.93
37	తుమ్మగూడెం	801	731	91.26
38	డిటో	945	820	86.77
39	డిటో	1090	1031	94.59
40	టి. గుడిపాడు	864	782	90.51
41	చిత్తపూరు	977	865	88.54
42	డిటో	1204	1099	91.28
43	డిటో	970	917	94.54
44	సోమవరం	380	349	91.84
45	డిటో	933	844	90.46
46	మర్లపాలెం	583	503	86.28
47	డిటో	591	546	92.39
48	డిటో	680	641	94.26
49	డిటో	621	598	96.30
50	కొత్తగూడెం	1024	978	95.51
51	యర్రావారిగూడెం	489	461	94.27

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ముదినేపల్లి, మే 17: ముదినేపల్లిలోని ఒక చేపల చెరువు గట్టుపై విద్యుదాఘాతానికి గురై అన్నవరానికి చెందిన బి. బాలసాయి (28) అనే యువకుడు మృతి చెందాడు. శుక్రవారం ఆ చెరువు వద్ద జనరేటర్ నుంచి విద్యుత్ ఛేంజ్ ఓవర్ పనిచేస్తుండగా ఆ యువకుడు మరణించాడు. అతనిని కాపాడేందుకు యత్నించిన సైఫుల్లా అనే వ్యక్తి తీవ్ర గాయాలకు గురికాగా అతను విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలసాయి మృతితో అన్నవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శివారు గ్రామాల్లో పెరిగిన ఓటింగ్

▸ప్రధాన గ్రామాల కంటే ఎక్కువ పోలింగ్ నమోదు

ముదినేపల్లి, మే 17 : ముదినేపల్లి మండలంలోని శివారు గ్రామాల్లో ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం బాగా పెరిగింది. గత ఎన్నికల్లో 82 శాతం మించి పోలింగ్ జరగని శివారు గ్రామాల్లో ఈసారి 90 నుంచి 94 శాతం ఓటింగ్ నమో దైంది. ప్రధాన గ్రామాల కంటే ఎక్కువ శాతం ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనటం విశేషం. మండలంలోని ముదినేపల్లిలో 83 శాతం ఓటింగ్ శాతం నమోదు కాగా శివారు గ్రామమైన అన్నవరంలో 91 శాతం, పెయ్యేరులో 89 శాతం జరగ్గా, దాని శివారు గ్రామం అప్పారావుపేటలో 90 శాతం, కాకరవాడలో 92 శాతం ఓటింగ్ నమోదు కాగా, శివారు గ్రామం దేవరంలో 94 శాతం, శ్రీహరిపురంలో 89 శాతం, శివారు గ్రామం చేవూరుపాలెంలో 94 శాతం, పెదగొన్నూరులో 89 శాతం, శివారు గ్రామాలైన విశ్వనాథ్రిపాలెం 94 శాతం, ఉప్పరగూడెం 93 శాతం, చిగురుకోటలో 89 శాతం ఓటింగ్ జరగ్గా, శివారు గ్రామం గొల్లగూడెంలో 91 శాతం, ప్రొద్దువాక లో 88 శాతం ఓటింగ్ నమోదు కాగా, శివారు గ్రామం బొబ్బిలిగూడెంలోను 88 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో అతి తక్కువ మంది ఓటర్లు కలిగిన వి.రావిగుంటలో 94 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ గ్రామంలో 260 మంది ఓటర్లు ఉండగా 244 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి

ముసునూరు, మే 17: ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట, వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచి, సబ్సిడీపై ఇవ్వాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్ళలో రెండేళ్లు కొవిడ్ వల్ల పండించిన పంటకు మార్కెట్ లేక, మరో రెండేళ్ళ వర్షాభా వంతో పంటలకు సాగునీరు సరిగా లేక, ఖరీఫ్ సీజన్‌లో 60 శాతం పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. రబీ సీజన్‌లో డెల్టా ప్రాంతంలో ప్రభుత్వం సాగునీరు ఇవ్వకపోడంతో పంటలు వేయలేదన్నారు. ఈ సీజన్‌లో ముందుస్తుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలతోపాటు తొలకరి సాగుకు అవసరమైన వేరుశనగ, తదితర పప్పు ధాన్యాల విత్తనాలను 90 శాతం సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఖరీఫ్ వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచి 50 శాతం సబ్సిడీపై అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లక్ష్మణరావు కోరారు.

కుంగుతున్న రహదారి!

ఈడేపల్లి డ్రైన్ కల్వర్టు వద్ద ప్రమాదకర స్థితి



ముదినేపల్లి, మే 17 : ముదినేపల్లి మండలం విశ్వనాథ్రిపాలెం - పెదగొన్నూరు ఆర్ అండ్ బి రహదారిలో ఈడేపల్లి మైనర్ డ్రైన్ వద్ద ప్రమాదకర పరిస్థితి నెలకొంది. డ్రైన్ కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవటంతో రోడ్డు కుంగి కోతకు గురవుతోంది. భారీ వాహనాల రాకపోకలు పెరగటంతో ఆ కల్వర్టు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఏళ్ల తరబడి రోడ్డు కుంగిపోతున్నా కైకలూరు ఆర్ అండ్ బీ అధికారులు కనీసం కన్నెత్తి చూడలేదు. కల్వర్టు గోడలు కూలిపోయి పదేళ్లు గడిచినా తిరిగి నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. నిధుల కొరత వల్లే ఈ పని చేపట్ట లేకపోతున్నామని ఆర్అండ్‌బి అధికారులు చెబుతున్నారే తప్ప ప్రమాదకర పరిస్థితిని నివారించేందుకు శ్రద్ధ చూపటం లేదు. వారం రోజులుగా ఆ కల్వర్టు వద్ద రోడ్డు మరింత కుంగిపోయింది. ఈ రోడ్డు ప్రారంభంలో విశ్వనాథ్రిపాలెం వద్ద కూడా పంట కాల్వపై కల్వర్టు లేక రోడ్డు కుంగిపోతోంది.

కల్వర్టు నిర్మించాలి: వీరంకి చక్రపాణి, విశ్వనాథ్రిపాలెం గ్రామస్థుడు



ఈడేపల్లి మైనర్ డ్రైన్ వద్ద కల్వర్టును నిర్మించాలి. పైపు కల్వర్టును తొలగించి స్లాబు కల్వర్టు నిర్మిస్తేనే రోడ్డు పాడైపోకుండా ఉంటుంది. ఏళ్ల తరబడి అధికారులకు చెబుతున్నా పట్టించుకోవటం లేదు.

కొనకళ్లకు గౌడ సంఘం నేతల పరామర్శ



కలిదిండి, మే 17 : అనారోగ్యా నికి గురై విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను శుక్రవారం కలిదిండికి చెందిన గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వైస్ ఛైర్మన్ పోసిన చెంచు రామారావు, సంఘ నేతలు పరామర్శించారు. ఆరోగ్యం మెరుగు పడుతోందని త్వరలో కోలుకుంటానని కొనకళ్ల చెప్పారని వారు తెలిపారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం

కైకలూరు, మే 17: వేసవి మండుటెండల్లో.. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం లభించింది. గురువారం రాత్రి కైకలూరు పట్టణంలో సుమారు 2 గంటలకు పైగా భారీ వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండ వేడికి రెండు నెలలుగా అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. చల్లటి వాతావరణం ప్రజలకు ఊరట కలిగించింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు సన్నపాటి జల్లులు కురవడంతో ప్రజల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై చేరి చెరువులను తలపించాయి.